## పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కేసుల పరిష్కారంలో వేగంపెంచి రాష్ట్రంలోనే అత్యధిక కేసుల పరిష్కారంలో ముందు వరసలో ఉండేలా న్యాయ, పోలీసు అధికారులు పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి సూచించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్ డిస్ట్రిక్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి రమాదేవి మాట్లాడుతూ ఈనెల 20 జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరు అధికారులు సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా పని చేయాలని ఆదేశించారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తి జయ ప్రసాద్, జిల్లా కలెక్టర్ కె.హైమావతి, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ న్యాయవాదులు, ఏసిపిలు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## విద్యార్థుల ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూన్ 9 ప్రభాతవార్త :** మంగళవారం కలెక్టరేట్లో గత సంవత్సరం పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో జిల్లా ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. విద్యార్థులు ఐఐటివైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యాసంస్థలైన ఐటిలలో స్థానాన్ని పొందడానికి,ఎయిమ్స్‌లాంటి ఉత్తమ మైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో మంచిస్థాయి లో ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 560 ఆపైమార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, ఎగ్జిక్యూటివ్ ఫైల్, డిక్షనరీ, పెన్స్‌ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంఒ సుదర్శనమూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, సహాయ గణాంక అధికారి నవీన్, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మంత్రి వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న నీల మధు, తదితరులు

## ఇస్నాపూర్‌కు నిధులు కేటాయించండి

### కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

**పటాన్‌చెరు, జూన్ 9 ప్రభాతవార్త :** పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రత్యేకంగా పరిగణించి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ కోరారు. మంగళవారం సంగారెడ్డిలో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామిని ఇస్నాపూర్ చౌరస్తాలో కలిసి ఘనస్వాగతం పలికి నిధులు, పలు సమస్యలపై కౌన్సిలర్లతో కలిసి నీలం మధు ముదిరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ పరిధిలో గల 329 కాలనీ, ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని ఆ కాలనీలో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కరెంట్ పోల్స్, త్రాగునీరు, ఇంటి నెంబర్లు, కరెంట్ మీటర్లు, వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే నేషనల్ హైవే నుండి లక్డారం, బ్యాతోల్, రుద్రారం, ఏర్దనూర్ వరకు రోడ్డు, ఇరు వైపులా ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయాలని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన 15 కోట్ల నిధుల పనులు ఇప్పటికే ప్రారంభం అయినట్టు మంత్రికి ఆయన వివరించారు. అలాగే మరికొన్ని నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస గౌడ్, కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నే రాఘవేందర్, వెంకటేష్‌నాయక్, అల్లంగారి నర్సింహారెడ్డి, సంగన్నగారి గోపాల్, మంజలి దస్తగిరి, మణికంఠ, నాయకులు వల్లపు వెంకటేష్, మురళి, మహేష్, అనిల్, ప్రవీణ్, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సన్మానం



బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిని సన్మానిస్తున్న సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 9, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీకి చెందిన కుమారి భవాని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించడంతో మంగళవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఇండియా-థాయిలాండ్ టెస్ట్ సరీస్(మెన్ అండ్ ఉమెన్) 2025-26 బాల్ బ్యాడ్మింట్ ఫెడరేషన్ ఆఫ్ ఆసియా ఆధ్వర్యంలో మార్చి 11వ తారీఖు నుంచి 15వ తేదీ వరకు థాయిలాండ్‌లోని బ్యాంకాక్, పట్టాయా నగరల్లో కొనసాగిన పోటీల్లో కుమారి భవాని ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలవడంఅభినందనీయమని సింధూ ఆదర్శ్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలురాణియాదవ్ ఉన్నారు.

## అనుమతి లేకుండా హోర్డింగ్, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దు

**గజ్వేల్ టౌన్, జూన్ 9(ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులు, ప్రైవేట్ విద్యాసంస్థలు, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రింటింగ్‌ప్రెస్ యజమానులు అనుమతిలేకుండా వాణిజ్య ప్రకటనలకు సంబంధించిన పోస్టర్స్, ఫెక్సీలు, హోర్డింగ్‌లను రోడ్డుకు ఇరువైపులా, డివైడర్లపై, భవనాలపై పెట్టవద్దని మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టాలనుకుంటే ముందుగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి అనుమతి పొందాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

## బివిఆర్ఐటిలో అంతర్జాతీయ సదస్సు

### ప్రిన్సిపల్ సంజయ్ దూబే

**నర్సాపూర్, జూన్ 9, ప్రభాతవార్త :** ప్రపంచ ప్రఖ్యాత యాంటెన్నా, వైర్లెస్ కమ్యూనికేషన్ అంతర్జాతీయ స్థాయి పరిజ్ఞానాన్ని అందిస్తాయని బివిఆర్ఐటి ప్రిన్సిపల్ డా. సంజయ్ దూబే వెల్లడించారు. నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ ఐటిలో అంతర్జాతీయస్థాయి 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ మైక్రోవేవ్ సింపోజియం(వామ్స్ 2026) సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. వర్క్‌షాప్‌లో ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ సి.జె.రెడ్డి, అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా, ప్రసరణ సంఘం, అమెరికాప్రొఫెసర్ క్రిస్టోఫ్ ఫ్యూమాక్స్, మాజీ అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా, ప్రసరణ సంఘం, ఆస్ట్రేలియా తదితరులు హాజరయ్యారు. అనంతరం సంస్థ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్ర మం విద్యార్థులు, అధ్యాపకులు, యువ ఇంజనీర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, అంతర్జాతీయ నిపుణులతో మమేకమయ్యే అరుదైన అవకాశాన్ని కల్పిస్తోంది అని పేర్కొ న్నారు. ప్రధాన సదస్సు వామ్స్ 2026 జూన్ 10 నుండి 13 వరకు నిర్వహించబడుతుందని, ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి పరిశోధ కులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు మరియు విద్యార్థుల హాజరు కానున్నారనీ తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, డీన్లు, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

# బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ప్రయారిటీ, నాన్ ప్రయారిటీ రంగాల్లో నిర్దేశించిన రుణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీసీసీ, జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యతా రంగ రుణాలు మరింతగా అందించి లక్ష్యాలను సాధించాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సీడి ఆధారిత పథకాల రుణాలను ఎటువంటి జాప్యం లేకుండా అర్హులైన లబ్దిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని బ్యాంకులు మొత్తం రూ.9,450 కోట్ల రుణాలు పంపిణీ చేసి 87.60 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు ముందుండాలని ప్రాధాన్యతా రంగంలోని వ్యవసాయ విభాగంలో కనీసం 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ముద్ర, విద్యారుణాలు, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రంగాల్లో గణనీయమైన సేవలు అందించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రైతులు,స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలు అందించడంతో పాటు గోదాముల నిర్మాణానికి బ్యాంకులు సహకరించాలన్నారు. ప్యాక్స్, ఐకెపి సంస్థలు సైతం గోడౌన్‌ల సదుపాయాలు కల్పించుకునేలా రుణ సహాయం అందించాలన్నారు. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులకు తగిన సలహాలు, ఆర్థిక సహకారం అందించి పంట దిగుబడులు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం హరిబాబు, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎజిఎం హేమలత, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం మకరంద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎంలు రాజయ్య, శ్రీనివాస్, డీసీసీబీ డిజీఎం విశ్వేశ్వర్, నాబార్డ్ డీడీఎం నిఖిల్,ఎస్సీ కార్పోరేషన్ ఈడీ, వ్యవసాయ, డిఆర్‌డిఎ అధి కారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలిసి కట్టుగా ఉందాం..పార్టీ కోసం పని చేద్దాం

**నియోజకవర్గ ఇన్‌చార్జిపై గళమెత్తిన సీనియర్లు**
**అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం**
**కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం..**
**కష్టసుఖల్లో పాలుపంచుకుంటాం**
**శపథం చేసిన సీనియర్ నాయకులు**



సమావేశంలో పాల్గొన్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అందరం కలిసి కట్టుగా ఉందాం..పార్టీ కోసం పనిచేద్దామని నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో శపథం చేసినట్లు తెలుస్తుంది. జిల్లా కేంద్రంలో మంగళవారం పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, నంగునూర్ ఎఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి, సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, నరకుల్ల శివప్ప, గూడెటి శ్రీనివాస్, నాయిని నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పార్టీ పటిష్టత, కార్యకర్తల కష్టసుఖాలుపై చర్చించినట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ ఒంటెద్దు పోకడలు ఆయన వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో గళమెత్తినట్లు తెలిసింది. సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే సిద్దిపేట నియోజకవర్గానికి నామినేటెడ్ పోస్టులు కేటాయించారని నియోజకవర్గ ఇన్‌చార్జి పాత్ర ఏమాత్రం లేదని కార్యకర్తలకు విన్నవించినట్లు సమాచారం. సిఎం ఆదేశాల మేరకు సీనియర్లు కలిసి పనిచేయాలని సూచించడంతోనే సమావేశం నిర్వహించారని తెలుస్తుంది. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగాఉన్న పూజల హరికృష్ణ కార్యకర్తలకు అందుబాటులో ఉండకుండా ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయకుండా కార్యకర్తలను గ్రూపులుగా విభజించి ప్రోత్సాహిస్తున్నారని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. సీనియర్ కార్యకర్తలను పట్టించుకోకుండా తన ఇష్టానుసారంగా వ్యవహారిస్తు పార్టీకి తీరని నష్టం చేస్తున్నారని సీనియర్లు తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ఇక నుంచి అందరం కలిసి కట్టుగా ఉంటూ కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉందామని సీనియర్ నాయకులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణను మార్చాలని పార్టీ అధిష్టానానికి మరోసారి ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.పలువురు సీనియర్ కార్యకర్తలు పార్టీ అధికారంలో ఉన్న అధికారులు పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. రాబోయే జడ్పీటిసి,ఎంపిటిసి ఎన్నికలతో పాటు సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పని చేసి పార్టీ జెండాను రెపరెపలాడిద్దామని ప్రతిజ్ఞ చేసినట్లు సమాచారం. మొత్తం మీద సీనియర్ నాయకులు ఎన్నడూ లేని విధంగా ఏకతాటిమీదికి రావడం సిద్దిపేట రాజకీయ వర్గాలో చర్చనీయంశంగా మారింది.

## ఘనంగా రేణుక పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

### బోనాల ఊరేగింపు

**నర్సాపూర్, జూన్ 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ ఉత్సవాలకు ఆలయ నిర్మాణదాత బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ దంపతులు హాజరయ్యి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా బోనాలను ఊరేగించారు. అనంతరం శ్రీ రేణుక పరమేశ్వరి అమ్మవారికి ఒడిబియ్యాన్ని సమర్పించారు. ఈ ఆలయాన్ని నిర్మించి సంవత్సరం గడిచిన నేపథ్యంలో గొల్లపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి . ఈ వార్షికోత్సవ ఉత్సవాల్లో రెండు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాలను ఊరేగించడం, శివసత్తుల పూనకాలు, ఒగ్గు కథలు వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలను తీసుకెళుతున్న మహిళలు

# ప్రైవేట్‌కు ధీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్

### 15 నుండి పాఠశాలల ప్రారంభం.. ప్రారంభమైన అడ్మిషన్లు.. రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్

**మర్కుక్, జూన్ 9 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రభుత్వ విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌నికోలస్ అన్నారు.మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంగళవారం పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాలను ప్రభుత్వం రంగంలోనూ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. పాఠశాలలో ఆధునిక తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ వ్యవస్థ, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, విశాలమైన క్రీడామైదానాలు, ఇండోర్ స్పోర్ట్స్ సదుపాయాలు, గ్రంథాలయం, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రీ-ప్రైమరీ నుంచి హైస్కూల్ వరకు సమగ్ర విద్య విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల నిర్వహణ కోసం ఇద్దరు ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఏడుగురు ఎస్‌జిటిలు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక పీఈటి, ఒక పిడిని నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శాస్త్రికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించడంతోపాటు ఈనెల 15వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నర్సరీ నుంచి ఎనిమిదో తరగతివరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్న ఈ పాఠశాల ప్రభుత్వ విద్య నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే నమూనా విద్యా సంస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగరస్థాయి విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమం విద్యా రంగంలో కీలక మలుపుగా మారనుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు వచ్చిన మొదటి అడ్మిషన్ పత్రాన్ని డాక్టర్ నవీన్ నికోలస్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ ఇంజనీర్ షఫీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, తహసీల్దార్ సరిత, ఎంఈవోలు ఉదయ భాస్కర్‌రెడ్డి, సైదులు, డీఈ నాగరాజు, ఏఈ రాజేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, లతీఫ్, రహీం, పిఆర్‌టియు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీనివాస రావు, కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, రజిత, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, కాంట్రాక్టర్ బిక్షపతి, సిఆర్‌పిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ పబ్లిక్ స్కూల్ వద్ద అడ్మిషన్ స్వీకరిస్తున్న రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్

## జహీరాబాద్ హైస్పీడ్ రైల్వేస్టేషన్‌ను కొనసాగించాలి

### ప్రధాని కార్యాలయానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లేఖ

**సదాశివపేట, జూన్ 9 (ప్రభాతవార్త) :** ముంబై-హైదరాబాద్ హైస్పీడ్ రైల్(బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టులో పాత అలైన్మెంట్‌లో ప్రతిపాదించిన జహీరాబాద్ హైస్పీడ్ రైల్‌స్టేషన్‌ను కొనసాగించాలని కోరుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రధాని కార్యాలయంతోపాటు మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారికంగా వినతిపత్రం పంపారు. ఈ మేరకు జూన్ 8న ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసి, జహీరాబాద్ స్టేషన్ కొనసాగింపుతో సంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందని వివరించారు. వినతిపత్రంలో జహీరాబాద్ స్టేషన్ కొనసాగితే జిల్లాలో పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, సామాజిక-ఆర్థిక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే జాతీయ పెట్టుబడి తయారీ మండలి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, రవాణా అనుసంధానం మరింత మెరుగుపడతాయని వివరించారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త నెమలికొండ వేణుమాధవ్ స్పందిస్తూ, జహీరాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అంశాన్ని ప్రధానమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ అభివృద్ధి కోసం ఆయన చేసిన ఈ ప్రయత్నం అభినందనీయమని అన్నారు.జిల్లా ప్రజల తరఫున స్పందించి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపిన ఎమ్మెల్యేకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ, జహీరాబాద్ హైస్పీడ్ రైల్ స్టేషన్‌ను తుది ప్రణాళికలో కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వేణుమాధవ్ కోరారు.

## ప్రధానోపాధ్యాయులు సాంబయ్యకు సన్మానం

**వెల్దుర్తి , జూన్ 9, ప్రభాతవార్త :** వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు పదో తరగతి పరీక్షలు 100 ఉత్తీర్ణతకు కృషిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్యను మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ సాంబయ్యను ఘనంగా సన్మానించారు. 560 మార్కులు సాధించిన విద్యార్థి అక్షయను జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ పాఠశాలను పదో తరగతి పరీక్షల్లో 100 కృషి చేసిన ఉపాధ్యాయుల కు. కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలి

### తహసీల్దార్ ఎదుట పెట్రోల్ బాటిళ్లతో రైతుల నిరసన





పెట్రోల్ బాటిల్ తో నిరసన తెలుపుతున్న రైతులు

**కొల్చారం, జూన్ 9 (ప్రభాతవార్త):** మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొల్చారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో నిరసన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ధాన్యాన్ని విక్రయానికి సిద్ధంగా ఉంచినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ధాన్యం తడిసిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సంగాయిపేట గ్రామ రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులు పెట్రోల్ బాటిళ్లతో తమ నిరసనను తెలియజేస్తూ తహసిల్దార్ చాంబర్ లోకి వెళ్లి పెట్రోల్ బాటిల్ తో నిరసన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు.

## వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

### -ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి



తీగుల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, జూన్ 9(ప్రభాతవార్త):** వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తీగుల్ గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పెంచిన మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలో వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. నర్సరీలో ఉన్న మొక్కలను వేరుచేసి నాటేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలోని గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వానాకాలం ప్రారంభమైందని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపివో ఖాజా మొయినొద్దీన్, కార్యదర్శి నరేష్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన కలెక్టర్

**అల్లాదుర్గం, జూన్ 9, ప్రభాతవార్త:** ఇటీవల ముగిసిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 560 మార్కులపై పైబడి సాధించిన విద్యార్థులను మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందచేసి అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, పోషకులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.



10లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్

## సర్' పై అవగాహనకు బిజెపి పూర్తిస్థాయి కార్యాచరణ

### న- మేడ్చెల్ అర్బన్ జిల్లా ప్రభారీ నందనం దివాకర్



బిజెపి చింతల్ డివిజన్ సమావేశంలో కొట్టే రాజా సదానంద్‌ను సత్కరిస్తున్న మేడ్చెల్ జిల్లా ప్రభారీ నందనం దివాకర్

**కుత్బుల్లాపూర్, జూన్ 9 ప్రభాతవార్త**

దేశ వ్యాప్తంగా' సర్' పై పూర్తి అవగాహన కల్పించేందుకు భారతీయ జనతాపార్టీ దృఢసంకల్పంతో ముందడుగు వేస్తుందని మేడ్చెల్ అర్బన్‌జిల్లాప్రభారీ నందనం దివాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతాపార్టీ పిలుపు మేరకు చింతల్ బిజెపి అధ్యక్షులుగా బాధ్యతతో కొట్టే రాజా సదానంద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'సర్' ద్వారా ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఎన్నికల అవకతవకలను సమర్ధవంతంగా ఎదుర్కొనే అవకాశం కలుగుతుందన్నారు. రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు కొట్టే రాజా సదానంద్ మాట్లాడుతూ పార్టీ పిలుపుమేరకు సర్"పై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించడం, పార్టీ గెలుపుకు నిరంతరం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబిసి ప్రధాన కార్యదర్శి బాను చందర్ వర్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్‌రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు , బూత్ అధ్యక్షులు, బూత్‌లేవల్ నాయకులు సమావేశంలో పాల్గొని చింతల్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా ఎన్నికైన కొట్టే రాజా సదానంద్‌ను శాలువాలతో సత్కరించారు.

## ఆరోగ్య భారత్‌ను నిర్మిద్దాం : డాక్టర్ రజని ప్రియ



యోగా శిక్షణా శిభిరంలో రజని ప్రియ

**అల్వాల్, జూన్ 9 ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతి సాంప్రదాయాలులో యోగా ఒక బాగంగా ఉందని నేటి యువతరం నిత్య జీవనంలో అనుసరించాలని బొల్లారం రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజని ప్రియ కోరారు. మంగళవారం అల్వాల్‌లో జరిగిన ఉచిత యోగా శిక్షణా తరగతులకు ఆమె ముఖ్య అతిధిగా విచ్చేశారు. జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రజని ప్రియ ఆవిష్కరించారు. ప్రపంచం మొత్తం యోగాను స్వీకరించడం భారతీయులుగా గర్వపడాలని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రపతి నిలయంలో యోగా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా ముఖ్య శిక్షకుడు వస్తరి శివుడు ఆహార నియమాలు మానసిక ఆరోగ్య శారీరక సమతుల్యతకు సంబంధించిన విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షణా తరగతులు నిర్వాహకులు బోగా విష్ణుమూర్తి ఇతరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని జడ్‌సికి జితేందర్‌నాథ్ వినతి



జడ్‌సికి వినతి పత్రం అందిస్తున్న జితేందర్‌నాథ్

**అల్వాల్, జూన్ 9 ప్రభాతవార్త:**

ప్రజావసరాలు మేరకు మౌలిక వసతులు కల్పించాలని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ జడ్‌సికి వినతి పత్రం అందించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయానికి వచ్చిన జడ్‌సి సంచిత్ గంగ్వార్‌తో సమావేశమై పలు సమస్యలుపై చర్చించారు. పట్టణంలో జీవవైవిధ్యంలో బాగంగా పార్కులు, క్రీడా స్థలాలు అభివృద్ధి, మచ్చబొల్లారం మార్కెట్, కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇందిరా గాంధీ విగ్రహం పున ప్రతిష్ట, జంక్షన్ అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని పరిష్కారానికి కృషి జరుగుతుందని జడ్‌సి జితేందర్‌నాథ్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

## మొగుళ్ల రాజిరెడ్డిని అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు



మొగుళ్ళ రాజిరెడ్డిని అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త**

ఇటీవలే జలమండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి మంగళవారం బెంజారా హిల్స్, మినిస్టర్స్ కాటర్స్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మొగుళ్ల రాజిరెడ్డి ,తెలంగాణ జల మండలి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో ఉద్యోగుల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డిను మంత్రి శాలువా పుష్పాగుచ్చాం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఏ. శ్రవణ్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## రాంనగర్‌లో నీటి సమస్యపై ఎమ్మెల్యే పర్యటన



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి జూన్ 9 ( ప్రభాతవార్త ) :** రాంనగర్ డివిజన్ పరిధిలోని బాకారం బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యపై మంగళవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. బస్తీలో నీటి సరఫరాలో వస్తున్న అంతరాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శంకర ముదిరాజ్, దామోదర్ రెడ్డి, స్థానిక బస్తీవాసులు అంజిరెడ్డి, నర్సింగ్ రావు, శ్రవణ్, నేత తదితరులు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో నిజాంపేట డంపింగ్ యార్డు తరలింపు

**-విద్యార్థులు, స్థానిక ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన సమస్యకు శాశ్వత పరిష్కారం**

**-రూ.20 కోట్లతో ఎస్సీ హాస్టల్ నిర్మాణం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జీడిమెట్ల, జూన్ 9, ప్రభాతవార్త**

వేలాది మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు, భవిష్యత్తులో ఇక్కడ విద్యనభ్యసించనున్న గురుకుల విద్యార్థులకు ఇబ్బందిగా మారిన నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.మంగళవారం బాచుపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రాంగణం సమీపంలోని డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించామని, ఆ ప్రాంతంలో కొన్ని నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి నెలకొందని అన్నారు.ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు తరలింపు అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం రూ.20 కోట్ల వ్యయంతో ఆధునిక హాస్టల్ నిర్మించామని, త్వరలో గురుకుల విద్యార్థులు ఇక్కడకు రానున్న నేపథ్యంలో పరిశుభ్రమైన, సురక్షి తమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.స్థానిక కాలనీవాసులు తమ సమస్యలను వివరించగా బాధ కలిగిందని మంత్రి తెలిపారు. గతంలో చిన్నారిపై కుక్కల దాడి జరిగిన ఘటన ఎంతో విషాదకరమని పేర్కొంటూ, డంపింగ్ యార్డు పరిసరాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయన్న ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.డీసీపీతో మాట్లాడి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని సూచిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.గతంలో డంపింగ్ యార్డు తరలింపుపై కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందాయని, ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు ప్రక్రియ కారణంగా కొంత ఆలస్యమైందని మంత్రి వివరించారు. ప్రస్తుతం అన్ని శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టి నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు. గురుకుల విద్యార్థుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పునరుద్ఘాటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థ భవన నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అయితే డంపింగ్ యార్డు ముందునుంచే అక్కడ ఉండటంతో విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి డంపింగ్ యార్డును త్వరితగతిన తరలించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కార్పొరేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# తొలకరి వర్షానికే గోదారిలా మారిన నార్సింగి రోడ్లు

**- అవస్థల్లో బాలాజీ నగర్ కాలనీ వాసులు**

**- అధికారుల తీరుపై మండిపడుతున్న బాధిత ప్రజలు**



తొలకరి వర్షానికే నార్సింగిలో గోదారుల్లా మారిన రోడ్ల దృశ్యం

**నార్సింగి, జూన్ 9 ప్రభాతవార్త :**

తొలకరి వర్షానికే నార్సింగి సర్కిల్ పరిధిలోని రోడ్లు గోదారులుగా మారాయి. కేవలం 20.నిమిషాల పాటు కురిసిన వర్షానికే నార్సింగిలోని బాలాజీ నగర్‌లో మూడు ఫీట్ల ఎత్తులో వరద నీరు రోడ్డుపై పారింది. ద్విచక్రవాహనాలన్నీ నీట మునిగిపోయాయి. వాహనదారులు ఈ రోడ్లపై వెళ్లేందుకు సుమారు గంట సమయం ట్రాఫిక్‌లో ఇరుకుపోయారు. ప్రతీఏటా బాలాజీ నగర్‌లో వరద నీటితో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. మా కాలనీలో వరద నీటి ఇబ్బందులు తొలగించాలని బాలాజీ నగర్ ప్రజలు అనేకమార్లు స్థానిక రాజకీయ నాయకులు, అధికారులకు ఫిర్యాదులు, విన్నపాలు చేసినా ఎవరూ స్పందించడం లేదు. ఈ సారి తొలకరి వర్షానికే నడుం ఎత్తులో వరద నీరు పారడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 20.నిమిషాల వర్షానికే వరద నీరు ఇంతగా పొంగితే ఇక రాత్రంతా వర్షం కురిస్తే మా పరిస్థితి ఏమిటని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. వేసవిలోనే వరద నీటి కాలువల పూడికను తీయడం, వరద నీరు నిలువ ఉండే ప్రాంతాలలో మరమ్మత్తులు చేయడం వంటి పనులు చేయడంలో అధికారగణం అలసత్వం వహించిందని బాధిత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతీ ఏటా తాము వరద నీటితో ఇబ్బందులు పడడంను గమనిస్తూనే ఉన్నా దీన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారగణం ముందుకు రాకపోవడం బాధాకరంగా ఉందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. సకాలంలో తాము ఇంటి పన్నులు అధికారులకు చెల్లిస్తున్నామని, అయినా మా ఇబ్బందులను పరిష్కరించంలో అధికారులు చొరవ చూపకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమని మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారగణం స్పందించి మాకు శాశ్వత పరిష్కారం చూపాలని బాలాజీ నగర్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం.. జలమండలి అధికారులపై బిజెపి నేతల ఆగ్రహం



**చిక్కడపల్లి జూన్ 9, ప్రభాతవార్త :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్, సబర్మతి నగర్ బస్తీల్లో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్, మంగళవారం బస్తీ వాసులతో కలిసి స్థానిక వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లి డిజిఎం వెంకట్ రెడ్డిని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటే, ఇప్పుడు సరఫరానే పూర్తిగా నిలిపివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజల ఆవేదనను, బీజేపీ నేతల ఆగ్రహాన్ని గమనించిన డిజిఎం వెంకట్ రెడ్డి స్పందిస్తూ.. సమీపంలోని ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిచిపోయిందని వివరించారు. బుధవారానికల్లా పనులు పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, మాజీ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్, బస్తీ వాసులు లక్ష్మయ్య, రాము, యాదగిరి, ధనరాజ్, రవిచంద్ర, శ్రీను, ప్రశాంత్‌లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పత్తికుంటను మరింత అభివృద్ధి చేయండి



**అత్తాపూర్ జూన్ 9,ప్రభాతవార్త :** పత్తికుంటను మరింత అభివృద్ధి చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ మెంబర్ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జోనల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి పత్తికుంటను అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన కార్యక్రమాల కోసం రాజేంద్రనగర్ డివిజన్‌లోని పత్తికుంటను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం పత్తికుంటలో వినాయక నిమర్జనం కొరకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి రాజేంద్రనగర్, కిస్మత్పూర్ బండ్లగూడ హైదర్గూడా, ఉప్పర్ పల్లి, అత్తాపూర్, ప్రేమావతి పేట్, శివరాం పల్లి, కాటేదాన్, మైలార్ దేవ్ పల్లి మరియు చంద్రయాన్ గుట్ట, కార్వాన్, తాళ్ల గడ్డ, లంగర్ హౌస్‌తో పాటు మొయినాబాద్, శంకరపల్లి మండలాల నుండి భారీ విగ్రహాలు తరలివస్తాయని లోతు తక్కువ ఉండడంతో విగ్రహాలు పైకి తేలుతూ ఉంటున్నాయని దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పత్తికుంట చెరువులో నిమజ్జనానికి అనుకూలంగా ఉండే విధంగా 150 ఫీట్ల పొడవుతో 50 ఫీట్ల వెడల్పుతో 20 ఫీట్ల లోతుతో పెద్ద గుంత తీయించి మూడు క్రేన్లు పట్టే విధంగా రిటనింగ్ వాలు, ప్లాట్ ఫామ్ నిర్మాణం చేసి ఇబ్బంది కలగకుండా చూడాల్సిందిగా జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కోరారు.అనంతరం జోనల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. ఇ. నరేందర్ గౌడ్, డి. ఇ యాదయ్య, ఏఇ. నర్సింహా మూర్తి వర్క్ ఇన్స్పెక్టర్ ఆనంద్‌తో కలిసి పత్తికుంట చెరువు ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పొన్నమోని మల్లేష్ యాదవ్, డొప్ప సత్య నారాయణ ముదిరాజ్, సాబాధ విజయ్ కుమార్, విక్రమ్ చారి, సాయితేజ రెడ్డి పాల్గొన్నారు.

## సిఎస్ రామకృష్ణారావును కలిసిన బసవరాజ్ శ్రీనివాస్



**చిక్కడపల్లి జూన్ 8 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావును రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు సిఎస్ రామకృష్ణారావు ఆప్యాయంగా స్వాగతం పలికి, సాదర ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా బస్వారాజ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సేవ పట్ల సిఎస్ ఉన్న ఉన్న అంకితభావం, ఆయన పరిపాలనా నైపుణ్యం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. వారు నిండు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, భవిష్యత్తులో మరింత విజయవంతంగా ప్రజలకు ఉన్నత సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## అంధకారంలో విద్యానగర్..కుప్పకూలిన చెట్లు



విరిగిన స్తంభాలను పరిశీలిస్తున్న డిఈ నరేంద్ర రాజు

**చిక్కడపల్లి జూన్ 9 ( ప్రభాతవార్త ) :** విద్యానగర్ లోని పలు ప్రాంతాలలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి చెట్లు నేలకూలడంతో రహదారులు మూసివేశారు. అచ్యుత రెడ్డి మార్గంలోని బ్రహ్మంగారి గుడి లైన్ లో భారీ చెట్టు విద్యుత్ స్తంభం పై పడిపోవడంతో రహదారి మూసివేసి వచ్చింది. ఎస్బిఐ వెనకాల లోని మోడరన్ టవర్స్ అశోక బిల్డర్స్ సమీపంలో మరో భారీ వర్షం కూలిపోయింది. మసీదు లైన్ లో అపార్ట్మెంట్ సమీపంలో మరో భారీ వృక్షం కూలిపోవడంతో ఈ రహదారి కూడా రాకపోకలు అయ్యాయి. దీనితో వారి వృక్షాలు విద్యుత్ స్తంభాలపై తీగలపై పడడంతో పూర్తిగా విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. విద్యానగర్లోని తెగిన తీగలు విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ డీ నరేందర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఏం నరసయ్య నగర ఉపాధ్యక్షుడు జైపాల్ రెడ్డి డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్లు ఈ ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నీరా,టాడిపై నిషేధాన్ని ఎత్తివేసి కులవృత్తులను కాపాడండి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కర్నాటక మంత్రి చలువరాయ స్వామిగౌడ,పిసిసి అధ్యక్షులు బికె హరిప్రసాద్‌గౌడతో సమావేశమైన శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్,జూన్ 9,ప్రభాతవార్త:**

కర్నాటక రాష్ట్రంలో నీరా,టాడీపై నిషేదాన్ని ఎత్తివేసి కులవృత్తులను ఆదుకోవాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరాష్ట్ర పిసిసి అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిని బీకే హరిప్రసాద్ గౌడ, వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ స్వామి గౌడను కోరారు. ఈమేరకు మంగళవారం కర్ణాటక ఓబీసీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. కర్ణాటక రాష్ట్రంలో వృత్తి ఆధారిత కులాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర మాదిరిగా కర్ణాటకలో నీరా, టాడి విక్రయాలను పునరుద్ధరించి, వైన్ షాపుల కేటాయింపులలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర శాసనసభ ప్రాంగణం ముందు నారాయణ గురు విగ్రహాన్ని ఏర్పాటుచేయాలనన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తాటి, ఈత, కొబ్బరి చెట్ల నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు.అదేవిధంగా వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక పరిశోధనలు జరిపి హైబ్రిడ్ రకాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కర్ణాటక రాష్ట్రంలో సుమారు 40 లక్షల గౌడ జనాభా ఉన్నప్పటికీ, టాడి విక్రయాలపై నిషేధం కారణంగా వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. నిషేధాన్ని ఎత్తివేసి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా సొసైటీల ద్వారా నీరా దాని ఉప ఉత్పత్తులను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఓబీసీ అధ్యక్షులు బాలరాజు గుత్తేదార్, నారాయణ కురుబ, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సంతోష్ గోగి, కర్ణాటక గౌడ సంఘం అధ్యక్షులు సంతోష్ గుత్తేదార్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల శ్రమకు తగిన వేతనాలు అందాలి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

**పేట్ బషీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త**

భవన నిర్మాణ కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు వారు చేసే పనికి అనుగుణంగా న్యాయమైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కేపీ వివేకానంద్ పేర్కొన్నారు.మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్, సుభాష్ నగర్ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న జీవన వ్యయాలు, నిర్మాణ రంగంలో పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణం, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల శ్రమే అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, వారి సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం విషయంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన. ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్ నగర్ కమిటీ అధ్యక్షుడు పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి. వెంకయ్య, కార్యదర్శి వి. శ్రీనివాస్, యూనియన్ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జూన్ 9, ప్రభాతవార్త**

ప్రగతి నగర్ డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ ప్రగతి నగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి డిమాండ్ చేశారు. అసమర్థ నీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలు, అదనపు నీటి కేటాయింపు, క్యాన్ నంబర్లు లేని కనెక్షన్లకు వెంటనే క్యాన్ నంబర్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నరేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రగతి నగర్ ప్రాంత ప్రజలు చాలాకాలంగా తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రగతి నగర్ ప్రధాన కార్యదర్శి మధన్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు అనూరుద్ర, సీనియర్ నాయకులు నందో బ్రహ్మ, సుభదీర్, స్థానిక రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, కిషోర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారి రజనీకాంత్ రెడ్డితో సమావేశమై ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, నీటి లభ్యత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని అధికారుల నుంచి హామీ పొందినట్లు నాయకులు తెలిపారు. తదుపరి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పిరమిడ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న రమ

**నిజాంపేట్, జూన్ 9, ప్రభాతవార్త**

నిజాంపేట్‌లో శాశ్వత పిరమిడ్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమ సోమవారం బాచుపల్లి ఎమ్మార్వోను కలిసి పిరమిడ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కుంచపు రమ మాట్లాడుతూ ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత పెంపొందడంతో పాటు జీవితంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని వివరించారు. ప్రజలు ధ్యానం చేసేందుకు అనువైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో నిజాంపేట్‌లో శాశ్వత పిరమిడ్ ఏర్పాటు అవసరమని తెలిపారు.ధ్యానం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు ఒత్తిడి తగ్గి, మానసిక స్థైర్యం పెరుగుతుందని ఎమ్మార్వోకు వివరించారు. పిరమిడ్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఆమె సవివరంగా చర్చించారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో, జిల్లా కలెక్టర్ నుంచి స్థలం కేటాయింపుపై ఆదేశాలు వస్తే తప్పకుండా సహకరిస్తామని, అవసరమైన మద్దతు అందిస్తామని హామీ ఇచ్చినట్లు కుంచపు రమ తెలిపారు.అనంతరం కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డిని కలిసి పిరమిడ్ నిర్మాణానికి అనువైన స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కొలను హనుమంత రెడ్డి పిరమిడ్ ఏర్పాటు కోసం అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.నిజాంపేట్ ప్రాంత ప్రజలకు ధ్యానం, యోగా వంటి ఆధ్యాత్మిక, ఆరోగ్యపరమైన కార్యక్రమాలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ ప్రయత్నం కొనసాగిస్తున్నట్లు కుంచపు రమ పేర్కొన్నారు.

## జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడికి బెదిరింపులు

**జూబ్లీహిల్స్, జూన్ 9, ప్రభాతవార్తః**

ది జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌లో ఆర్థిక అక్రమాలపై నిలదీసిన అధ్యక్షుడిపై బెదిరింపులకు పాల్పడిన కోశాధికారిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు సొసైటీ ఖాతాల్లో అనుమానాస్పద ఆర్థిక అవకతవకలు గుర్తించి వాటిపై కోశాధికారి భీమగాని మహేశ్వర్‌ను వివరణ కోరారు. దీంతో అధ్యక్షుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. జూన్ 4న సొసైటీ కార్యాలయంలో మహేశ్వర్ అసభ్య పదజాలంతో దూషించి, చంపేస్తానంటూ తీవ్రంగా బెదిరించాడు. కార్యాలయంలో ఉన్న వస్తువులతో దాడి చేయడానికి ప్రయత్నించి, అతన్ని అడ్డుకున్నాడు. అంతేకాకుండా అతని డ్రైవర్ ద్వారా సైతం బెదిరింపులకు దిగాడు. ఈ వ్యవహారమంతా సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యిందని, మహేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలంటూ గోపరాజు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో జరుగుతున్న ఆర్థిక అక్రమాలు బయటపడకుండా అడ్డుకునేందుకే ఈ బెదిరింపులు చేస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గోపరాజు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంగళసూత్రం మాయం.. తమ్ముడిపై అక్క ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, జూన్ 9, ప్రభాతవార్తః**

తన మంగళసూత్రం తన సోదరుడు చోరీ చేసి ఉంటాడని అనుమినిస్తూ ఒక అక్క బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీం నగర్‌లో నివసించే స్వర్ణలత తన తల్లిదండ్రుల వద్ద కొద్ది రోజులు ఉండేందుకు బంజారాహిల్స్‌లోని ఇబ్రహీం నగర్‌కు వచ్చింది. మే 25న సాయంత్రం 6.30 గంటల సమయంలో 19 గ్రాముల బరువున్న తన బంగారు మంగళసూత్రాన్ని హాల్‌లోని ఒక సెల్ఫ్‌లో పెట్టి మరిచిపోయింది. మరుసటి రోజు మంగళసూత్రం కోసం వెతకగా అది కనిపించలేదు. ఇంట్లో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. తన సోదరుడు రాజుపై ఆమె అనుమానం వ్యక్తం చేసింది. గతంలో కూడా వ్యక్తిగత అవసరాల కోసం సోదరుడు తన తల్లి బంగారు గొలుసును తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో తన మంగళసూత్రాన్ని అతడే అపహరించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా వైద్యురాలికి వేధింపులు.. ముగ్గురిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 9, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లోని ఓ దంత వైద్యశాలలో మహిళా వైద్యురాలిపై దాడి, వేధింపులు నేపథ్యంలో ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని జాష్ డెంటల్ హాస్పిటల్‌కు వికాస్, శశాంక్‌తో పాటు మరో గుర్తుతెలియని వ్యక్తి వచ్చారు. వారు రిసెప్షన్ వద్ద వైద్యురాలు సాజిదా జరీన్ ఆజ్‌ను కలవాలని కోరారు. ఆ సమయంలో వైద్యురాలు సమావేశంలో ఉండటంతో వారు అక్కడ ఎదురుచూశారు. సమావేశం అనంతరం వైద్యురాలు తన ఛాంబర్ నుంచి లిఫ్ట్ వైపు వెళ్తుండగా, ఆ ముగ్గురు ఆమె వెంట లిఫ్ట్‌లోకి ప్రవేశించారు. లిఫ్ట్‌లో ఆమెను అడ్డగించి తోసివేయడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించి, ఆమె గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరించారు. వారి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించగా బలవంతంగా లిఫ్ట్ నుంచి బయటకు నెట్టివేశారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషించి, చేతులతో దాడి చేశారు. ఈ ఘటనతో వైద్యురాలు తీవ్ర భయాందోళనలకు గురైంది. వైద్యురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి గల కారణాలు తెలియదని, గతంలో సామాజిక మాధ్యమాల్లో ఆసుపత్రికి సంబంధించిన ప్రకటనల నేపథ్యంలో ఈ దాడి చేసి ఉంటారని వైద్యురాలు ఫిర్యాదులో అనుమినిస్తూ పేర్కొన్నారు.

## నిందితుల అరెస్ట్ .. సొత్తు స్వాధీనం...

**గోషామహల్,జూన్ 9 ప్రభాతవార్త:**

ఇంట్లో దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ము గ్గురు నిందితులను గోషామ హల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్‌కథనం ప్రకా రం... జ్ఞాన్‌బాగ్ కాలని ప్రాంతానికి చెందిన అరవింద్(38), పానిపూరి వ్యాపారం చేసుకుంటున్నారు.గత నెల 27వ తేదిన మధ్య రాత్రి సమయంలో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డా రు.బాధితుడి ఫిర్యాదుమేరకు రెండు సెల్‌ఫోన్లు ,5వేల రూపాయలు,వంటగ్యాస్ సిలిండర్‌ను దొంగతనం చేసి తీసుకువెళ్లినట్లుఫిర్యాదు పేర్కొన్నారు.పోలీసులు సిసి టివి పుటేజ్ ఆదారంగా విశ్వసనీయ సమాచారం మేరకు దేవినగర్ ప్రాంతానికి చెందిన ఎ.ప్రవీన్‌కుమార్(21),దూల్‌పేట్ జుంగుబస్తీకి చెందిన కె.సాయిశ్యామ్‌సింగ్ (36),జుమ్మెరాత్ బజార్ ప్రాంతానికి చెందిన డి.వినీత్‌కుమార్ అలియాస్ విన్ను, (42)లు కలిసి దొంగతనంచేసినట్లు తెలుసు కుని వారి ని అదుపులోకి తీసుకుని విచారించారు.తామే దొంగతనం చేసినట్లు అంగీకరించ దంతో వారిపై గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగతనం చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

## పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం

### మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

**హుస్నాబాద్ టౌన్, జూన్ 9, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం హుస్నాబాద్‌లోని పొడి చెత్త సేకరణ కేంద్రం, కంపోస్ట్ యార్డు, డంపు యార్డులను మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ పద్మతో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి వాహనాలకు అందించాలని ప్రజలకు వివరించారు. తడి చెత్తను వేరు చేయడం ద్వారా నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపించడం ద్వారా తిరిగివినియోగంలోకి తీసుకురావచ్చని తెలిపారు. చెత్తను కలిపి ఇవ్వడం వల్ల రీసైక్లింగ్ ప్రక్రియకు ఆటంకం ఏర్పడటంతో పాటు కంపోస్ట్ తయారీ కష్టతరమవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల వ్యర్థాల నిర్వహణ వ్యయం పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, పురపాలక సంఘం చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

### ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న



మాట్లాడుతున్న వెంకన్న

**హుస్నాబాద్ రూరల్, జూన్ 9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను ప్రారంభించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల్లో ప్రస్తుతం "విలీనమా..? యూనియన్ ఎన్నికలా..?" అనే గందరగోళ పరిస్థితి నెలకొన్నదని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని కార్మికుల్లో ఉన్న అనిశ్చితికి తెరదించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, ఉద్యోగుల భవిష్యత్తు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్రత దృష్ట్యా విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, సీపీఐ కోహెడ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్ ఉన్నారు.

## సేవా భావంతో పాఠశాలలను నడిపించాలి : డీఈవో



డిఈవో శాస్త్రిని సత్కరిస్తున్న ట్రస్మా నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 9, ప్రభాతవార్త :** విద్యను వ్యాపార ధోరణిలో కాకుండా సేవాభావంతో పాఠశాలలను నడిపించాలని డిఈవో శాస్త్రి సూచించారని ట్రస్మా ప్రతినిధులు తెలిపారు. ఇటీవల జిల్లా నూతన డిఈవోగా బాధ్యతలు చేపట్టిన శాస్త్రిని మంగళవారం కలెక్టరేట్‌లో డిఈవో కార్యాలయంలో ట్రస్మా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరం టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని తెలిపినట్లు తెలిపారు. విద్యతో పాటు విద్యార్థులు మానసికంగా,శారీరకంగా దృఢపడేలా చూడాలని సూచించినట్లు వివరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు.డిఈవోను కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగిడి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తు మహిపాల్‌రెడ్డి, కోశాధికారి కాయిత శ్రీధర్‌రెడ్డి, ఇసి సభ్యులు అశోద అంజయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, జాయింట్ సెక్రటరీ మిద్దెల యాదగిరి, జిల్లా గౌరవాధ్యక్షుడు కాయిత నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## హైదారాబాద్ తరలివెళ్లిన మహిళా సమాఖ్య నాయకులు



హైదారాబాద్‌కు తరలివెళ్తున్న మహిళా సమాఖ్య నాయకులు

**తొగుట, జూన్ 9, ప్రభాతవార్త:** హైదారాబాద్‌లో నిర్వహించిన మహిళా సమాఖ్యలకు బస్సుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన తొగుట మండల మహిళా సమాఖ్య సభ్యుల బస్సును మంగళవారం ఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. తొగుట మహిళా సమాఖ్యల నుంచి రూ.6 లక్షల వాటాతో పాటు ప్రభుత్వం తరపున రూ.30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి మండల సమాఖ్యకు బస్సును కేటాయించడం మహిళా అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సమీర్‌అహ్మద్‌ఖాన్, సర్పంచ్ శోభ కొండల్‌రెడ్డి, ఎపిఎం బాబురావు, భరత్‌తేజ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 9, ప్రభాతవార్త :** పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన సన్నరకం వడ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలుచేసే ప్రతి వస్తువుకు బిల్లు ఇవ్వాలని, స్టాక్ బోర్డులను పెట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల సరఫరా కొనసాగించాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులను కూడా రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.



పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

## బదిలీ అయిన గ్రామ పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**నర్సాపూర్, జూన్ 9, ప్రభాతవార్త :** నర్సాపూర్ మండలం అచ్చంపేట గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ను శాలువాలతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి మాట్లాడుతూ 7 సంవత్సరాలుగా అచ్చంపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ గ్రామంలోని సమస్యల పట్ల స్పందించి వారి సమస్యలు పరిష్కరించేవాడని అన్నారు. గ్రామస్తులతో కలిసిమెలిసి సామరస్యంగా సమస్యలు తెలుసుకుని వాటిని అధికారులకు విన్నవించి పరిష్కరించే వాళ్లని ఇన్ని సంవత్సరాలుగా గ్రామంలో సేవలు అందించిన శ్రీనివాస్ మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన చేసిన సేవలు కొనియాడారు. అచ్చంపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నూతన కార్యదర్శిగా శ్రావణి సింధూజ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్ కు వీడ్కోలు పలకగా నూతన గ్రామ కార్యదర్శి శ్రావణి సింధుజ కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి, ఉపసర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు ఆంజనేయులు, ప్రవీణ్, కృష్ణ,నరసమ్మ, లక్ష్మి ృ, అంగన్వాడీ టీచర్. జ్యోతి.గ్రామ పెద్దలు గోవర్ధన్, ఆంజనేయులు నర్సింలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన అధ్యాపకులు, విద్యార్థులు

**పటాన్‌చెరు, జూన్ 9 ప్రభాతవార్త :** దేశవ్యాప్త తల్లి పేరిట ఒక మొక్క(ఏక్ పేడ్ మా కే నామ్) చొరవలో భాగంగా, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ప్రచారం, పర్యావరణ సుస్థిరత, జీవావరణ స్పృహను ప్రోత్సహిస్తూ, తమ తల్లుల గౌరవార్థం ఒక మొక్కను నాటమని పౌరులను ప్రోత్సహిస్తోంది. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు (గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్) వివిధ గీతం స్కూళ్ల అధిపతులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టించడం పట్ల గీతం యొక్క నిబద్ధతను ఈ చొరవ పునరుద్ఘాటించింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో, సుస్థిర జీవనాన్ని ప్రోత్సహించడంలో మొక్కలు నాటడం యొక్క ప్రాముఖ్యతను ఇందులో పాల్గొన్న ఉన్నతాధికారులు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ప్రకృతి పట్ల శ్రద్ధ, పోషణ, బాధ్యత వంటి విలువలను ప్రతిబింబిస్తూ, తల్లులకు ఒక ప్రతీకాత్మక నివాళిగా కూడా నిలిచింది. మొక్కల పెంపకం కార్యక్రమం, సుస్థిరత, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడానికి గీతం హైదరాబాదు చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఒక నిదర్శనంగా నిలుస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణ, దేశ నిర్మాణానికి అర్థవంతంగా తోడ్పడేలా గీతం సిబ్బందిని ప్రేరేపిస్తోంది.

## 20న పదవ తరగతి ప్రతిభావంతులకు పురస్కారాలు

**పటాన్‌చెరు, జూన్ 9 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 20వ తేదీన సైకిల్లు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు పరీక్ష సామాగ్రి అందించడం జరుగుతోందని తెలిపారు. అదేవిధంగా ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం నగదు పురస్కారాలు పంపిణీ చేస్తున్నమని తెలి పారు. ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించి నట్లు తెలిపారు. నియోజకవర్గపరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీవిద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్ చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల సామాజిక వర్గంపై దాడి నిందితులను అరెస్ట్ చేయాలి

**మొగుడంపల్లి, జూన్9, ప్రభాతవార్త:** ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుటుంబంపై జరిగిన దాడి ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని సంగారెడ్డి జిల్లా ఎరుకల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జహీరాబాద్ నియోజకవర్గ ఎరుకల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ...గత నెల మే 17న,మొగుడంపల్లి గ్రామానికి చెందిన గూడుపల్లి కమలమ్మ, ఆమె కుమారుడు వరుణ్ కుమార్, అత్త రంగమ్మల ఇంటిపై అదే గ్రామానికి చెందిన పూజారి కృష్ణ, పూజారి గోపాల్‌తో పాటు మరో ఏడుగురు వ్యక్తులు అక్రమంగా చొరబడి దారుణంగా దాడి చేశారు. ఈ సందర్భంగా బాధితులను వారి కులం పేరుతో దూషిస్తూ, తీవ్రంగా అవమానించారు. ఈ ఘటనపై బాధితులు చిరాక్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సెక్షన్లు నమోదు చేసినప్పటికీ, నెల రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్ట్ చేయకపోవడంపై అశోక్ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో దర్యాప్తును వేగవంతం చేసి కేసులో ఉన్న నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని, బాధిత కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలిని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఇతర కుల సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ సంఘం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## తుక్కాపూర్ ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తి

**కొల్చారం, జూన్ 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుండి సేకరించిన వరి ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్లే ఆంజనేయులు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన సొసైటీ సిబ్బందికి, రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రం నిర్వహించబడిందన్నారు. కొనుగోలు కేంద్రం విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

### మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసు

## ఇప్పటికే మిస్టరీగానే మిగిలింది

**చేవెళ్ల, జూన్ 9, ప్రభాతవార్త :** గత నెల 17 అర్ధరాత్రి కనకమామిడిలో వ్యాస్ అనే వ్యక్తి ఫామ్ హౌస్‌లో మసీదు బండకు చెందిన కొందరు వ్యక్తులు బర్తడే వేడుకలు చేసుకోవడం జరిగింది, ఆ పార్టీకి వచ్చిన వ్యక్తులలో కోడిచెర్ల సాయి కుమార్ అనే వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందడం జరిగింది. అయితే ఆరోజు ఆ ఫామ్ హౌస్‌లో కనీసం సిసి కెమెరాలు లేకపోవడం, ఎలా చని పోయాడు అనేది ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగిలింది, సంఘటన జరిగి 20 రోజులు గడుస్తున్న ఇప్పటికి ఒకర్ని అరెస్టుచేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది, వెంటనే నిందితులను అరెస్టు చేసి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని ఎసిపి ని కలిసి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నరేందర్ మాదిగ,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ శంకర్ మాదిగ,చేవెళ్ల మండల



జనగణన సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

## ఎండలను లెక్కచేయని జనగణన సిబ్బంది

### -జనగణన ఇన్‌చార్జ్ ఆఫీసర్ తహసీల్దార్ సరిత

**మర్కుక్, జూన్ 9 (ప్రభాతవార్త):** ప్రభుత్వం చేపట్టిన జనగణన కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా పూర్తిచేసిన సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు, వివిధ శాఖల సిబ్బందిని తహసీల్దార్, జనగణన ఇంచార్జ్ ఆఫీసర్ సరిత అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని ఐఓసి సమావేశ మందిరంలో జనగణన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి తీవ్రతను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు చూపిన నిబద్ధత ప్రశంసనీయమని ఆమె పేర్కొన్నారు. జనగణన ప్రక్రియను సమయపాలనతో, క్రమబద్ధంగా పూర్తిచేయడంలో సూపర్వైజర్లు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేశారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమగ్ర సమాచార సేకరణతో జనగణన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని తహసీల్దార్ సరిత పేర్కొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

### తెలంగాణ మజ్దూర్ యూనియన్



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కార్మికులు

**గజ్వేల్ టౌన్, జూన్ 9 (ప్రభాతవార్త):** తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామరెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. మెదక్ రీజినల్‌సెక్రటరీ డిఆర్‌కె.రావు, శాఖయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యూనియన్ నాయకులు, కార్మికులు, గ్యారేజ్ సిబ్బంది, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనియన్ పునరుద్ధరణతో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే కార్మికుల ఐక్యత, సంఘటిత పోరాట స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తూ, యూనియన్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న కార్మికులు తెలంగాణ మజ్దూర్ యూనియన్ బలోపేతానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ పునరుద్ధరణతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కొత్త ఊపునిచ్చే దిశగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

### పుష్పగిరి ఫౌండేషన్ టీం ఆధ్వర్యంలో

## ఉచిత కంటి వైద్య శిబిరం

**చేవెళ్ల, జూన్ 9, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పుష్పగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కౌన్సలర్ మాధవి యాదిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగింది ఈసందర్భంగా కోర్డినేటర్ త్రివేణి మాట్లాడుతూ కార్పోరేట్ స్థాయిలో వైద్యపరీక్షలు ఉంటాయని పేదలు వేలు ఖర్చు చేసుకునే వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు . అనుభవజ్ఞులై వైద్యులు శిబిరం లో హాజరై క్యాటరక్ట్, కంటికి సంభందించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి సంబంధిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది,ఈసందర్భంగా మల్కాపూర్ కౌన్సిలర్ మాదవి యాదిరెడ్డి మాట్లాడుతూఈ శిబిరంలో గ్రామానికి చెందిన వృద్ధులు, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు, మహిళలు, ఇతర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి కంటి ఆరోగ్యంపై పరీక్షలు నిర్వహించి, సమస్యలను గుర్తించి తగిన సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి సమస్యలను నిరక్ష ్యం చేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు సూచించారు. ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ ఉచిత శిబిరం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరురారు .ఈకార్యక్రమంలో పుష్పగిరి ఫౌండేషన్, సిబ్బంది త్రివేణి, యశ్వంత్ శివ, బాబు తదితరులు పాల్గొన్నారు

## హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజక వర్గంలోని ఫరూక్ నగర్ మండలం కమ్మదానం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను నిన్న సోమవారం రాత్రి ప్రజాప్రతినిధుల మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.హైమాస్ట్ లైట్లు ఏర్పాటువల్ల గ్రామంలో భద్రత పెరగడంతో పాటు రాత్రి సమయంలో ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుందని అన్నారు.తమ గ్రామానికి ఉపయోగపడే ప్రజాప్రయోజన కార్యక్రమాన్ని సొంత నిధులతో అమలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామస్తులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమ్మధానం సర్పంచ్ గోదుల లత కిరణ్ కుమార్ గౌడ్,ఉపసర్పంచ్ పెద్దింటి జగన్నాథ్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్, మెల్లగూడ సర్పంచ్ మంగారవి నాయక్,మాజీ సర్పంచులు నర్సిములు,చక్కటి వెంకటేష్ యాదవ్,తాంద్ర విష్ణు వర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,కమ్మదానం గ్రామకమిటీ అధ్యక్షులు శివగాళ్ల రాజు,వార్డు మెంబెర్స్ గులాబ్ శ్రీను,గడ్డమీది లక్ష్మి చెన్నయ్య గౌడ్,సిరిగిరి కవితవెంకటేష్ గౌడ్,జోగమ్మాగూడం బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్సాపూర్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**కొడంగల్,జూన్ 9,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి గ్రామంలోని పలు కాలనీల్లో గత కొంతకాలంగా మట్టితో పేరుకు పోయిన మురుగుకాల్వలను సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి జేసీబీ సహాయంతో తొలగించారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు.ప్రధానంగా మురుగుకాల్వల పరిశుభ్రత,తాగునీటి సరఫరా విద్యుత్ తదితర అంశాలపై ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.గ్రామాభివృద్ధితో పాటు ఆదర్శ గ్రామంలో తీర్చిదిద్దేందుకు కృసి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



నవీన్ నికోలస్ ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

## ఐదేళ్లకు 5 శాతం పెంపు సరిపోదు

**మర్కుక్, జూన్ 9 (ప్రభాతవార్త):** సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిపాదించిన 5 శాతం వేతన పెంపును వ్యతిరేకిస్తూ మండల ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. మండల సిఆర్‌పిల సంఘం అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఉద్యోగులు తమ ఆందోళనను వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ అంశంపై మర్కుక్‌కు వచ్చిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఐదేళ్ల కాలానికి కేవలం 5 శాతం వేతనం పెంపు ప్రతిపాదన అన్యాయమని పేర్కొన్నారు.పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం కనీసం 5 శాతం వేతనం పెంపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు లచ్చిరామ్‌నాయక్, అంజలి, ఎంఐఎస్ శ్రీధర్, ఆపరేటర్లు హరిబాబు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి సభకు తరలిన సంఘాల సభ్యులు

**మర్కుక్, జూన్ 9 (ప్రభాతవార్త):** మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి మర్కుక్ మండలం నుంచి పెద్దసంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు మంగళవారం బయలుదేరారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేయనున్న నేపథ్యంలో మండల ఏపిఎం ఎల్.యాదగిరి ఆధ్వర్యంలో మహిళలు సిఎం సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మర్కుక్ మండలానికి కూడా ఒక బస్సును పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, కార్యదర్శి కవిత, కోశాధికారి మౌనిక, సిసిలు కవిత, పద్మలత, విజయలక్ష్మి, బాలస్వామి, అకౌంటెంట్ రజిత, ఆపరేటర్ భాస్కర్‌తో పాటు 24 గ్రామ సంఘాల వివోఏలు, వివో అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తి నుంచి...**

**వెల్దుర్తి, జూన్ 9, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలం నుంచి మహిళ సమైక్య గ్రామ సంఘాల అధ్యక్షులు బస్సులో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుభాష్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్ఐ ప్రశాంత్

**హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, జూన్ 9, ప్రభాతవార్త:** అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్ తన మానవత్వాన్ని చాటుకుంటూ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ గ్రామ శివారులో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అదే సమయంలో విధుల్లో భాగంగా అటుగా వెళ్తున్న ఎస్ఐ ప్రశాంత్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన వారిని తన పోలీసు వాహనంలో ఎక్కించి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో వారికి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ ప్రశాంత్ చూపిన సమయస్ఫూర్తి, మానవత్వంపై స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు వెంటనే సహాయం చేసి ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## యువకులకు క్రీడా సామాగ్రి పంపిణీ

**అక్కన్నపేట, జూన్ 9, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం చాపగాని తండా గ్రామపంచాయతీ యువకులకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య మంగళవారం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గుగులోతు రాజేందర్ సమక్షంలో వాలీబాల్ కిట్, వ్యాయామ డంబుల్స్, స్కిప్పింగ్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ యువత క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత శారీరక దృఢత్వంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, గండిపల్లి సర్పంచ్ బంధారపు శ్రీనివాస్, బైకొని శ్రీనివాస్, డైరెక్టర్ బుర్ర ప్రభాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, చాపగాని తండా కార్యదర్శి చిరంజీవి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి అల్లాదుర్గం ఆనాటి శ్రీవర్ధన కోట

**అల్లాదుర్గం, జూన్ 9, ప్రభాతవార్త:** అల్లాదుర్గం ఒకప్పుడు శ్రీ వర్ధన కోటగా ప్రసిద్ధి చెందిన చాళుక్యుల ముఖ్య కేంద్రంగా ఉండేదని ఇక్కడ లభించిన శాసనాలు కొత్త చరిత్ర పరిశోధకులు బుర్ర సంతోష్ తెలిపారు. ఆ చారిత్రక సంపదను భావితరాలకు పరిచయం చేసి సంరక్షించాల్సిన అవసరం ఉందని చరిత్ర అభిమానులు కోరుతున్నారని తెలిపారు. అల్లాదుర్గంలో 1967లో జరిపిన తవ్వకాల్లో వెలుగు చూసిన వెయ్యిల నాటి కుడ్య చిత్రాలు ఢిల్లీలో పురావస్తు మ్యూజియంలో ఉన్నాయని చరిత్ర పరిశోధకులు బుర్ర సంతోష్ గుర్తు చేశారు.

## జీలుగ సాగుతో లాభాలెన్నో..

**నార్సింగి, జూన్ 9, ప్రభాతవార్త :** రైతులు జీలుగ మరియు జనుము సాగు చేసి నేలలో కలియదున్నినట్లయితే మంచి ఫలితాలు సాధించవచ్చని నార్సింగి మండల వ్యవసాయ శాఖ అధికారి భరత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సారవంతమైన భూముల్లో చెరువుల్లోని నల్ల మట్టిని వేస్తే మంచి నేల సారం పెరిగి మంచి దిగుబడులు వస్తాయిని రైతులు మట్టిని వేసే బదులుగ నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్టె ఎరువుల సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు కావున రైతులు అందుబాటులో ఉన్న జీలుగ లేదా జనుము విత్తనాలను సాగు చేసి నేలలో కలియ దున్ని నట్లయితే మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. అట్లాగే నేల స్వభావాన్ని బట్టి జీలుగు లేదా జనుము సాగు చేసుకుంటే తర్వాత వేసే పంటలకు అనుకూలంగా ఉంటుంది కాబట్టి పచ్చిరొట్టె ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలో కలియదున్నడంతో అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన పోషకాలు అందిస్తాయిని అన్నారు.

**అందుబాటులో విత్తనాలు...**

తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ మరియు జనుము విత్తనాలను ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో అందుబాటులో ఉంచింది. రైతు సంక్షేమ కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం పంటల్లో అధిక దిగుబడి రావాలనే ఉద్దేశంతో పంపిణీ చేస్తున్నది. అందు కోసమే జీలుగ, జనుము విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పచ్చిరొట్ట ఎరువుల మొక్కల్లో ప్రథమస్థానం జీలుగదే.మొక్కలు నాటిన 40 నుంచి 45 రోజుల్లోనే ఏపుగా పెరుగుతాయి.దుక్కిలో 30 కిలోల యూరియా వేసిన తర్వాత ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో ఉండే విధంగా చూడాలి. జీలుగను సాగు చేసిన తర్వాత 40 నుండి 45 రోజుల్లో ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుంది.ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి.లేదా రొటోవేటర్ సాయంతో పొలంలో కలియదున్నాలి.దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్‌ను దుక్కిలో వేయాలి.సూపర్ పాస్పేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్టె ఎరువుగా తయారవుతుంది.పొలంలో జీలుగ కుళ్లేదశలో నీటిని సక్రమంగా అందించాలి.30కిలోల బ్యాగును సబ్సిడీకి ప్రభుత్వం రూ.2452.50 మరియు జనుము 40 కిలోల బ్యాగును రూ.. 3110 విక్రయిస్తున్నది.

**సబ్సిడీపై జీలుగ,జనుము విత్తనాలు...**

జీలుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు అందుబాటులో ఉన్నాయి.ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే ఈ విత్తనాలను రైతులు సకాలంలో తీసుకొని వేసుకోవాలి. విత్తనాలను ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో విక్రయిస్తున్నాం.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

## మాస్టర్ యువర్ మైండ్ పుస్తకావిష్కరణ

**పెద్దశంకరంపేట, జూన్ 9, ప్రభాతవార్త :** పెద్దశంకంపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత భృంగి ప్రసన్నకుమార్ రచించిన 'మాస్టర్ యువర్ మైండ్' పుస్తకాన్ని మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మనిషి ప్రవర్తనలోని ప్రత్యేకతలను సరిగ్గా విశ్లేషించడం చాలా క్లిష్టమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. సాధారణంగా మనం పనివల్ల మాత్రమే అలసిపోతామని భావిస్తామని, అయితే అధిక ఆలోచనలు మనసును అలసటకు గురిచేస్తాయని వివరించారు. పరీక్షలను ఎదుర్కొనే విద్యార్థులకు, జీవితంలో స్థిరత్వం కోసం ప్రయత్నించే యువతకు, కుటుంబ బాధ్యతలపై ఆందోళన చెందే పెద్దలకు ఈ పుస్తకం మంచి మార్గదర్శిగా ఉపయోగపడుతుందని ఆమె కొనియాడారు. భవిష్యత్తులో రచయిత మరిన్ని మంచి పుస్తకాలు రచించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఇఓ రాజు ఏఎంఓ సుదర్శనమూర్తి, సీఎంఓ రాజు, ఎస్ ఓ నవీన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి 18న 'చలో హైదరాబాద్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 9, ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారానికి జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు పెద్దసంఖ్యలో కాంట్రాక్టర్లు తరలిరావాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు గురవుతున్నామని బిల్లులో కోసమే సభను నిర్వహిస్తున్నామని అన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడం, సిమెంట్, ఇనుము, డీజిల్‌వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, జీఎస్టీ భారం అధికంగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టర్ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆల్ ఇండియా పాస్ట్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డిఎన్ఎస్ రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బిఎన్ఎస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్. పవన్, రాష్ట్ర ట్రెజరర్ జి. సంతోష్ రెడ్డి, సంగారెడ్డి సెంటర్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, సత్యం, అశోక్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రికెటర్ నెవీన్‌మానిత్‌ను అభినందించిన జగ్గారెడ్డి



క్రికెటర్ నెవీన్ మానిత్‌ను అభినందిస్తున్న జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో జూన్ 9, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన వర్ధమాన క్రికెటర్ నెవిన్‌మానిత్‌ను సోమవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభినందించారు. మానిత్ ప్రతిభను మానిత్ తండ్రి, కాంగ్రెస్ నాయకుడైన మధు ద్వారా తెలుసుకున్న ఆయన, భవిష్యత్తులో మంచి క్రికెటర్‌గా ఎదగడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. మానిత్ ఇంకా మెరుగైన శిక్షణ పొందడానికి, వేర్వేరు టోర్నమెంట్లలో ఆడటానికి అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో మరింత బాగా ఆడి సంగారెడ్డి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, మాజీ క్రికెటర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## 20న జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 9, ప్రభాతవార్త:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవానిచంద్ర సోమవారం పోలీసు అధికారులతో ఈ నెల 20న, నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతు, రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్న చిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులలో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, శైలజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్, శ్రీనివాస్ కుమార్ ఏసీపీ, ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ, పాల్గొన్నారు

## గండిగూడెం చెరువు అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

**అమీన్‌పూర్, జూన్ 9 ప్రభాతవార్త :** అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం చెరువులోకి కాలుష్య జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గండిగూడెం చెరువులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రధానంగా చెరువు అలుగు పెంచడం మూలంగా సమీపంలోని ఖాజిపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీటిమట్టం పెరిగి ఇళ్లల్లోకి నీళ్లు చేరుతున్నాయని ఇటీవల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని పేర్కొన్నారు. అలుగు మట్టాన్ని పూర్వస్థితికి తీసుకుని రావడంతోపాటు.. పరిశ్రమల నుండి కాలుష్య జలాలు చెరువులోకి చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించి వాటిని బయటకు పంపించడం జరుగుతుందని తెలిపారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, రాజు, గణేష్, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సభకు తరలిన మహిళా సమాఖ్య సభ్యులు

**సదాశివపేట, జూన్ 9 ప్రభాతవార్త:** ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సదస్సు మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమానికి నలభై గ్రామ సంఘాల అధ్యక్షురాలు ఏపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళ శక్తి సదస్సు సందర్భంగా. బస్సుల ఇనాగ్రేషన్ కోసం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 553 బస్సుల ఇనాగరేషన్ కు కార్యక్రమానికి సదాశివపేట మండల సమాఖ్య కు మహిళా శక్తి లో భాగంగా ఒక బస్సు మంజూరు కావడం జరిగింది ఇట్టి బస్సు సంగారెడ్డి ఆర్టీసీ లో కాంట్రాక్టు పద్ధతిని పెట్టడం జరిగింది అగ్రిమెంట్ చేసుకోవడం జరిగింది ఇట్టి బస్సు కు నెలకు 70 వేల ఆదాయం మండల సమైక్యకు చేకురుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని 40 గ్రామ సంఘాల అధ్యక్షురాలు వెళ్లడం జరిగిందన్నారు కార్యక్రమంలో. సీసీలు శేఖర్‌లాల్ బహదూర్‌సింగ్, నర్సింలు. ప్రభుకుమార్, వీణ, మైపాల్, వివోఏలు హాజరు కావడం జరిగింది.

# ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు న్యాయం చేయాలి



గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూన్ 9 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 8లో ఉన్న 72.18 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించి, ఇళ్ల స్థలాలనుచేసి అప్పగించాలని కోరుతూ మంబాపూర్ గ్రామ లబ్ధిదారులు, యువకులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లి మున్సిపల్ చైర్మన్ చిన్న పాపనికుమార్‌గౌడ్‌కు, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం మంబాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 8లోగల 72.18 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం 62 మంది పేద లబ్ధిదారులకు కేటాయించింది. అయితే, ఇప్పటి వరకు ఈ భూమికి సంబంధించి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించకపోవడం వల్ల హద్దులు నిర్ధారణ కాలేదు. దీనివల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

**కబ్జాదారుల కన్ను.. ఆందోళనలో లబ్ధిదారులు..**

ఇదే అదనుగా భావించి కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పేదలకు కేటాయించిన భూమిని కబ్జాదారుల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంబంధిత అధికారులు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తక్షణమే స్పందించి, సర్వే నంబర్ 8 లోని 72.18 ఎకరాల భూమికి పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలని కోరారు. హద్దులు నిర్ధారించి, గత ప్రభుత్వం కేటాయించిన విధంగా 62 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను త్వరితగతిన అప్పగించి న్యాయం చేయాలని కోరారు. ఎలాంటి ఆక్రమణలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంబాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ తలారి దయానంద్, మాజీ వార్డ్ సభ్యులు యాట దయానంద్, యాట నాగరాజ్, మద్దూరి లక్ష్మణ్, గొట్టిముక్కల రాజు, రొయ్యపల్లి శ్రీకాంత్, కొండని ఎల్లయ్య, కాంజర్ల వెంకటస్వామి, నిరుడు శ్రీనివాస్, కొత్తపేట గోపాల్, పట్టా లబ్ధిదారులు పెద్దలు యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినతి పత్రాలు అందజేశారు. నిరుపేదలైన మాకు తగిన న్యాయం చేయకపోతే నిహారదీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు.



బీబీపాటిల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నామ స్రవంతి రవికిరణ్ తదితరులు

## బుల్లెట్ ట్రైన్‌ను జహీరాబాద్ మీదుగా మళ్లించాలి

**జహీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త :** హైదరాబాదు-ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును జహీరాబాద్ మీదుగా మళ్లించాలని కోరుతూ 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, బిజెపి నాయకులు బీబీ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, నిమ్జ్ వంటి భారీ ప్రాజెక్టులు ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం అత్యంత అవసరమని కౌన్సిలర్ స్రవంతి రవికిరణ్ పేర్కొన్నారు. గతంలో బీబీ పాటిల్ ఎంపీగా ఉన్న సమయంలోనే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో జహీరాబాద్‌ను ఒక స్టేషన్‌గా చేర్చడం జరిగిందని, ఇది ప్రాంత అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందని గుర్తు చేశారు. అయితే, తాజాగా సిద్ధం చేసిన డీపీఆర్లో మార్పులు చేసి, ఆ మార్గాన్ని వికారాబాద్ మీదుగా మళ్లించడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తిని, నిరాశను వ్యక్తం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్, దీనిపై తక్షణమే స్పందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర రైల్వే మంత్రిని, సంబంధిత ఉన్నతాధికారులను స్వయంగా కలిసి, డీపీఆర్‌లో తగిన మార్పులు చేసి బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని తిరిగి జహీరాబాద్ మీదుగా వెళ్లేలా, అక్కడ ఒక ఆధునిక రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, కోహిర్ మండల యువ నాయకుడు రాచయ్య యాదవ్, నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కడపల్ పంచాయతీ కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడపల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన అరుణ్‌కుమార్ కల్హేర్ మండల సామ్యానాయక్ తండాకు బదిలీ కాగా కల్హేర్ మండలం రాపర్తి పంచాయితీలో పంచాయతీ కార్యదర్శిగా సేవలు అందచేసిన రవీందర్‌రెడ్డి కడపల్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో కడపల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కృషిచేస్తానని కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు.

## ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాల అందజేత

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మంగళవారం విద్యార్థులకు అందచేసేందుకు మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ పాఠ్యపుస్తకాలను పంపిణి చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థుల చేతుల్లో పాఠ్య పుస్తకాలు ఉండేందుకు గాను ముందస్తుగానే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణి చేసినట్లు ఎంఈఓ నాగారం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ స్వప్న, సిఆర్‌పిలు ప్రకాష్ పాటిల్ క్రాంతి కుమార్, పి.శోభలు పాల్గొన్నారు.

## గైరాన్ తండాలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గైరాన్ తండాలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కడపల్ సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం

**కంది, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తునికిల తండాలో కొలువున్న జగదాంబ సేవాలాల్ దేవాలయ 37వ వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కొలువున్న అమ్మవారికి గ్రామ మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో కొనసాగిన వార్షికోత్సవ ఉత్సవాలతో గ్రామం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. రామ్‌రావు మహారాజ్ బోధనలతో ఈ ప్రాంతం సస్యశామలంగా మారిందని సర్పంచ్ కిషన్‌నాయక్ తెలిపారు. గ్రామస్థులతో పాటు పరిసర తండాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో విద్యా శాఖపై సమీక్షిస్తున్న ఉపాధ్యాయులు

## విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదుచేయాలి

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మంగళవారం సిర్గాపూర్‌లోని మండల వనరుల కేంద్రంలో ఎంఐఎస్, సిఆర్‌పిలు సమీక్షించారు. రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా పాఠశాలల స్థితి గతులపై, సౌకర్యాలపై చర్చించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థి బస్తాలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్య, నోటుపుస్తకాలను యుడైస్‌లోని సంఖ్యల ఆధారంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందేలా చూసుకోవాలన్నారు. ఎండిఎస్, ఎస్ఎంఎస్, ఎఫ్ఆర్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విధిగా నమోదు చేయాలన్నారు. 100 శాతం ఎఫ్ఆర్ఎస్‌కు ప్రయత్నం చేయాలన్నారు. గత విద్యా సంవత్సరంలోలాగా ఈ మారు మంచి ఫలితాలు వచ్చేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్, స్వప్న, సిఆర్‌పిలు ప్రకాష్ పాటిల్, క్రాంతి కుమార్, పి శోభా, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంతర్గాం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సర్పంచ్ సిసి రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో మంజూరైన 4 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ రవీందర్ పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యార్థులకు పాఠశాల ఆవరణలో బురద సమస్య లేకుండా ఉండేందుకు సిసి రోడ్డును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ రవీందర్ పేర్కొన్నారు.

## వెల్దుర్తి గ్రామ కార్యదర్శి కృష్ణకు సన్మానం

**వెల్దుర్తి, జూన్ 9, ప్రభాతవార్త :** వెల్దుర్తి గ్రామపంచాయతీ ఈవోగా ఇటీవల టి.కృష్ణ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం వెల్దుర్తిలోని పదవ తరగతివరకు చదివిన కృష్ణను తోటి స్నేహితులు ఇదే గ్రామానికి కార్యదర్శి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాకారం వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎండి.మజర్, చింతల రమేష్. కమ్మరి వెంకటేశం, గ్రామ పెద్ద రమేష్ చంద్రగుప్త పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వంపై అవగాహన

**రామచంద్రాపురం, జూన్ 9,ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీగార్డెన్స్‌లో మంగళవారం బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు డివిజన్ పరిధిలోని ప్రతి బూత్ స్థాయిలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్ నుంచి ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంపై అవగాహన కల్గి ఉండాలని, పార్టీ సభ్యత్వ నమోదు చేయగల ఇద్దరు యువతతోపాటు సీనియర్ బూత్ కో-ఆర్డినేటరర్‌ను ఎంపిక చేసి ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఈ సభ్యత్వ సమోదు కార్యక్రమానికి ఉపయోగపడుతుందన్నారు. బూత్ స్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించడం ద్వార డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, పరమేష్ యాదవ్, గోవింద్ యాదవ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం దృశ్యం



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌టియు నాయకులు

## ఘనంగా ఎస్‌టియు ఆవిరాభవ దినోత్సవం

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 9 ప్రభాతవార్త :** ఎస్‌టియు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ బడుల బలోపేతానికి పనిచేస్తుందని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్ అన్నారు. ఎస్‌టియు ఆవిర్భవించి 80వ సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మంగళవారం సంగారెడ్డిలోని కార్యాలయం ఎదుట సంఘం జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, నాయకులు ప్రతాపరెడ్డి ఎన్నికశాలి, శివశంకర్ రాథోడ్, లక్ష్మయ్య, మాజీ ఆర్థిక కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, మునిపల్లి మండల అధ్యక్షుడు ఖయ్యాం, పటాన్‌చెరు మండల అధ్యక్షులు సుందర్రావు, రామచంద్రపురం ప్రధాన కార్యదర్శి షరీఫ్, కంటి మండల బాధ్యులు అనిల్‌గౌడ్, నాయకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**మెదక్‌లో...**

**మెదక్, జూన్ 9 ప్రభాతవార్త:** ఎస్‌టియు టిఎస్ 80వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌టియుభవన్‌లో పతాకావిష్కరణను జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం జూలై 1, 2023 నుండి ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పిఆర్సిని ఇప్పటికి అమలు చేయకపోవడం సమంజసం కాదన్నారు. వెంటనే పిఆర్‌సిని అమలుచేయాలన్నారు. అదేవిధంగా హెల్త్‌కార్డుకు ప్రీమియం తగ్గించినప్పటికీ ఇప్పటివరకు అమలులోనికి రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఆర్థిక కార్యదర్శి కిష్టయ్య జిల్లా బాధ్యులు వేణుగోపాల్, దేవదాస్, అరుణ్‌కుమార్, సతీష్ దిలీప్, బాల మల్లేష్, వసంత్, నారాయణ, జబ్బార్, వెంకట కృష్ణ, నవీన్, విష్ణు, ప్రభాస్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**నారాయణఖేడ్, జూన్ 9 ప్రభాతవార్త :** మూడో వార్డ్ కౌన్సిలర్ అభిషేట్కార్ మంగల్ గ్రామానికి చెందిన ఉప్పరి రాములు అనారోగ్యంతో కొన్ని రోజుల క్రితం హాస్పిటల్ చికిత్స పొంది మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబానికి మనోధైరం ఇచ్చి, ఆపదలో నేనున్నని, వారి కుటుంటుంబానికి అన్ని రకాలుగా ఆదుకుంటానని దైరం ఇచ్చి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఉప్పరి రవికుమార్, రాములు, సాగర సతీష్, సాగర నర్సింలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 9, ప్రభాతవార్త :** నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పేద విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను సంఘ భవనంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లేబర్ ఆఫీసర్ యాదయ్య హాజరై విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు లక్ష్మయ్య చంద్ర ప్రకాష్ జిల్లా అధ్యక్షులు మామిళ్ల నాగభూషణం మహిళా అధ్యక్షురాలు అనసూయ ప్రధానకార్యదర్శి రాజారాం వర్కింగ్ ప్రెసిడెంట్ శివకాంతం డివిజన్ అధ్యక్షులు చేర్యాల ఆంజనేయులు జిల్లా ఉపాధ్యక్షులు కంది మురళి వీరన్న వీరేశం కోశాధికారి సత్తయ్య ప్రచారకార్యదర్శి సుభాష్ రవి మండల అధ్యక్షులు సంగాడి మండల అధ్యక్షులు సాయికుమార్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బస్సు ప్రారంభం



జండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, జూన్ 9, ప్రభాతవార్త:** మహిళా సంఘాలు ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.36 లక్షలతో బస్సు కొనుగోలు చేశాయి. బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం టిక్యా నాయక్, సర్పంచ్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ మక్సుధ్ హైమద్ పాల్గొన్నారు. అనంతరం జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ బస్సు దోహదపడుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే అందించాలి



మాట్లాడుతున్న సిపిఎం పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య

**కొండాపూర్ జూన్ 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సిపిఎం మండల అధ్యక్షుడు రాజయ్య మంగళవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వమే రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ధర పై అందించాలని సిపిఎం మండల అధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు భరోసా వర్షాకాలపు డబ్బులు రైతులకు వెంటనే విడుదల చేయాలని కోరారు. వడ్లు, జొన్నలు కొనుగోలు కేంద్రాలు దగ్గర రైతులు పడి కాపులు కాస్తున్నారని వెంటనే కొనుగోలు చేసి ఖాతాలలో డబ్బులు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఆసిఫ్ అలీ బాబురావు ప్రవీణ్ నాయకులు వెంకన్న కృష్ణ పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ తల్లికి వెండి కిరీటం

**మనూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయానికి హైద్రాబాద్‌కు చెందిన రాయికోడ్ బాలాజీ కళావతి దంపతులు 480 గ్రాములు వెండి కిరీటాన్ని తమ కుటుంబ సభ్యులతో కలిసి బహూకరించారు. ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా కళావతి, బాలాజీ దంపతులు తమ కుటుంబ సభ్యులతోకలిసి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కళావతి బాలజీ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలుచేసి శాలువాతో సత్కరించి ప్రసాదాన్ని అందచేశారు. ఆల యంలో కొలువున్న అమ్మవారికి వెండి కిరీటాన్ని బహుకరించిన కళాశాత బాలజీ దంపతులకు ఆలయ ఈవో శివ రుద్రప్ప అభినందనలు తెలిపారు.



బోరంచ నల్లపోచమ్మ తల్లికి వెండి కిరీటాన్ని బహుకరిస్తున్న భక్తులు

# వ్యవసాయ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనం.. నిరాశలో రైతులు



వ్యవసాయ శాఖలో ఖాళీ కుర్చీల దృశ్యం

**సదాశివపేట, జూన్ 9 (ప్రభాతవార్త):** వర్షాకాలం ప్రారంభమై వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న తరుణంలో రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు కార్యాలయంలో కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వ్యవసాయాధికారి కార్యాలయం మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకే ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. సమాచారం కోసం కార్యాలయానికి వచ్చిన రైతులు, ప్రజలు అధికారులు ఎవరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. కార్యాలయంలో ఉన్న బాబిలిగాం క్లస్టర్ అధికారి మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల వారీగా పనిచేసే క్లస్టర్ అధికారులు నాలుగు గంటల వరకే కార్యాలయానికి వచ్చి వెళ్లిపోయారని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఉదయం నుంచి కార్యాలయానికి రాలేదని పేర్కొన్నారు. సమాచారం కోసం వచ్చిన ప్రజలు ఎవరిని సంప్రదించాలని ప్రశ్నించగా, సమాచారం అయినా వ్యవసాయాధికారి మాత్రమే ఇస్తారని, ఆయన లేకపోవడంతో మరుసటి రోజు రావాలని సూచించినట్లు తెలుస్తోంది. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న సమయంలో రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాల్సిన అధికారులు సమయపాలన పాటించకపోవడం, కార్యాలయంలో కనీసం ఒక్క అధికారి లేకపోవడం శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, అధిక ధరలకు ఎరువుల విక్రయాలు, వర్షపాతం వంటి అనేక సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ అధికారుల నిర్లక్ష్యధోరణి ఆందోళన కలిగిస్తోంది. మండలంలోని పలు రైతు సమాఖ్యల అధ్యక్షులు ఎరువులను నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, వాటిపై తగిన చర్యలు కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

కొందరు ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో వ్యవసాయ శాఖ అధి కారులు కుమ్మక్కై ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణ లోపిం చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ శాఖ కార్యాలయ పనితీరుపై విచారణ చేపట్టి, రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు